సాక్షి
కర్నూలు
బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని నిత్యకళావేదికపై మంగళవారం నెల్లూరు జిల్లాకు చెందిన మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలోని నందీశ్వరునికి, బయలు వీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.67
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:100.174
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 29,907
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:15,264

బది'లీలలు' పొడిగింపు!

ఈ నెల 15 వరకు బదిలీల గడువు

- నేతల చుట్టూ మరోమారు తప్పని ప్రదక్షిణ
- ఇప్పటికే పూర్తయిన సిఫారసులు, పరస్పర అవగాహన
- తాజా నిర్ణయంతో ఉద్యోగుల్లో ఆందోళన
- అధికారుల బదిలీలకూ తాత్కాలిక బ్రేక్
- ఎక్కడికక్కడ చక్రం తిప్పుతున్న చోటా నేతలు

బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. అంతా సవ్యంగా సాగుతుందని సంబరపడిన ఉద్యోగుల్లో ప్రభుత్వ నిర్ణయం గందరగోళం నింపింది. సిఫారసు లేఖలు తెచ్చుకోవడం.. డబ్బు ఖర్చు పెట్టడం.. చోటా నాయకులను ప్రసన్నం చేసుకోవడం.. ఒకరికొకరు ఒప్పందం.. ఇలాంటివన్నీ జరిగిపోయాక, బదిలీల గడువు పెంచడం అందరిలో ఉత్కంఠ రేపుతోంది. తమ బదిలీ అలాగే ఉంటుందా? లేక తమకన్నా ఎక్కువ సిఫారసుతో ఎగరేసుకుపోతారా? అనే సంశయం ఉద్యోగులను వెంటాడుతోంది.




కర్నూలు(అర్బన్): ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఈ నెల 15 వరకు గడువు పెంచడంతో ఉద్యోగులు ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతున్నారు. కోరుకున్న ప్రాంతానికి వెళ్లేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా, ఉన్న సీటు పదిలం చేసుకునేందుకు మరికొందరు మార్గాలను వెతుక్కుంటున్నారు. గత నెల 31లోగా బదిలీలను పూర్తి చేయాలని గతంలో జారీ చేసిన ఉత్తర్వులను కాస్త సవరించి గడువు పెంచడంతో ఉద్యోగుల్లో కలవరం మొదలైంది. తాము వెళ్లాలనుకున్న ప్రాంతానికి ఎవరు పోటీ వస్తారో, మ్యూచువల్‌కు గతంలో అంగీకరించిన వారు, తిరిగి ఎక్కడ మనసు మార్చుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తాము కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయించుకునేందుకు స్థానిక ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలతో వివిధ ప్రభుత్వ శాఖల్లో అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే సంబంధిత నేతలతో వారు తమ శాఖలకు చెందిన ఉన్నతాధికారులకు ఫోన్లు కూడా చేయించుకున్నారు. అయితే హఠాత్తుగా బదిలీలకు గడువు పెంచడంతో రెండవ దఫా సంబంధిత ప్రజా ప్రతినిధుల వద్దకు వెళ్లేందుకు వారు జంకుతున్నారు. ఎలాంటి సిఫారుసు లేని వారు, నిబంధనల మేరకు బదిలీల పరిధిలోకి రాని వారు(రిక్వెస్ట్) తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తాజా పరిస్థితితో రాజకీయ పైరవీలు జోరందుకున్నాయి. చోటా నేతలకు చేతి నిండా పని దొరికినట్లయింది. బడా నేతలను ప్రసన్నం చేసుకునేందుకు చోటా నేతల చేయి తడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగుల బదిలీలు కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

అధికారుల బదిలీలకు తాత్కాలిక బ్రేక్

బదిలీల గడుపు పెంపుతో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారుల బదిలీలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆగస్టు 31లోగా బదిలీలను పూర్తి చేయాలని గతంలో జారీ చేసిన జీఓతో వివిధ ప్రభుత్వ శాఖల్లోని అధికారులకు స్థానచలనం తప్పదని, ఫలానా వారు వస్తున్నారనే ఊహాగానాలు షికార్లు చేశాయి. కొత్త అధికారుల నేతృత్వంలోనే బదిలీలు జరగాలని మౌఖిక ఆదేశాలు కూడా అందాయి. అయితే బదిలీల గడుపు పెంపుతో తమకు స్థానచలనం తప్పదని భావించిన అధికారులు కూడా తాము కోరుకున్న స్థానాల్లోనే ఉండేందుకు తిరిగి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు

పరస్పర అవగాహన, రాజకీయ సిఫారసుల మేరకే..

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికనే బదిలీలకు అవకాశం ఇవ్వడంతో తమ సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు ఉద్యోగులు నానా మార్గాలు వెతుకుతున్నారు. రాజకీయ నాయకులు, ఉద్యోగ సంఘాల నేతల చుట్టూ తిరుగుతున్నారు. విభజన తర్వాత కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లాకు అనేక మంది వెళ్లారు. అలా వెళ్లిన వారిలో మెజారిటీ ఉద్యోగులు తిరిగి కర్నూలు జిల్లాకు వచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు ఎంత ఖర్చు అయినా వెనుకాడడం లేదు. ఇప్పటికే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ శాఖల్లో బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. ఈ రెండు శాఖల్లో కూడా ఇంజినీర్లు పరస్పర అవగాహనకు వచ్చినట్లు సమాచారం. జోన్–4 పరిధిలో జరిగిన ఈ బదిలీల్లో ప్రధానంగా రాజకీయం చోటు చేసుకున్నట్లు విమర్శలు ఉన్నా యి. నేతల సిఫారసు లేఖలకు అనుగుణంగానే కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే అపవాదు ఉన్నవారిని దూరంగా విసిరేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పలు పోస్టులకు తాము చెప్పినట్లు నడుచుకుంటేనే లేఖలు ఇస్తామని ముందుగానే షరతులు పెట్టినట్లు తెలుస్తోంది.



పలుకుబడి ఉన్న వారిదే రాజ్యం

గతంలో బదిలీల ప్రక్రియ కౌన్సెలింగ్ ద్వారా జరిగేది. ప్రస్తుతం సిఫారసు లేఖలకే ప్రాధాన్యం ఉండటంతో పలుకుబడి ఉన్న వారికే కోరిన ప్రదేశానికి బదిలీ అవుతోంది. పలు శాఖల్లో నామమాత్రంగా కౌన్సెలింగ్ నిర్వహించి, చివరకు తాము అనుకున్న విధంగానే బదిలీలు చేస్తారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో సాధారణ ఉద్యోగులకు న్యాయం జరగడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఏమాత్రం పలుకుబడి లేక చాలామంది ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తుండటం గమనార్హం.

సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్ పూర్తయినా?

- బదిలీల్లో భాగంగా జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు గత నెల 29న కౌన్సెలింగ్ నిర్వహించారు.
- బదిలీలకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ 75లో పేర్కొన్న మార్గదర్శకాలకు లోబడి ఉన్న వారి బదిలీలు ఖాయమైనా, మిగిలిన వారంతా నేతల సిఫారసు లేఖలతో దరఖాస్తు చేసుకున్నారు.
- వీరు కూడా కౌన్సెలింగ్‌కు హాజరై తమ రిక్వెస్టులను విన్నవించుకున్నారు.
- ఇంతలోనే ప్రభుత్వం బదిలీల గడువు పెంచడం.. ఈ నేపథ్యంలోనే భారీ వర్షాలు, తుఫాన్లు రావడం వల్ల అధికార యంత్రాంగం బదిలీలపై దృష్టి సారించలేకపోతోంది.
- ఏదేమైనా ఈ నెల 10వ తేదీ తర్వాతే బదిలీలకు సంబంధించిన ఫైళ్లలో వేగం వచ్చే అవకాశం కనిపిస్తోంది.

న్యూస్‌రీల్

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

కర్నూలు సిటీ: డిసెంబర్ 8న నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 17వ తేదీ వరకు పెంచినట్లు డీఈఓ కాగిత శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000 లోపు ఉండి, 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www. bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఎంసీఏ ప్రవేశాల వెబ్‌కౌన్సెలింగ్‌కు దరఖాస్తు

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ ఐసెట్ –2024లో ఉత్తీర్ణులైన విద్యార్థులు రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌కు ఈనెల 4 నుంచి 7వ తేదీ లోపు https://icet-sche.aptonline.in/ICET/Views/index.aspx సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ వి.లోకనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలన్నారు. ఈ ఏడాది నుంచి ప్రారంభం కానున్న ఎంసీఏ కోర్సులో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వర్సిటీలో చేరేందుకు వెబ్‌ఆప్షన్స్ ఇచ్చుకోవాలనుకునే వారు యూనివర్సిటీ ఐసెట్ కౌన్సిలింగ్ కోడ్ 'ఏహెచ్‌యూయూ'ను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈనెల 17న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. 21వ తేదీలోగా వర్సిటీ కళాశాలలో విద్యార్థులు రిపోర్ట్ చేసుకోవాలన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.


ఆన్‌లైన్ ద్వారా వ్యవసాయ విద్య

కర్నూలు(అగ్రికల్చర్): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దూర విద్య ద్వారా వ్యవసాయ విద్యను పొందడంపై ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీలోపు రూ.1,500 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలని కర్నూలు ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సుజాతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆన్‌లైన్ ద్వారా నెల రోజుల పాటు తరగతులు నిర్వహించి వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు www.angrau.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా 80087 88776, 83096 26619, 80960 85560 నంబర్లకు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

16 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 16 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఆలూరులో అత్యధికంగా 33.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదోనిలో 12.8, తుగ్గలిలో 9, హొళగుందలో 8, పత్తికొండలో 5.8, మద్దికెరలో 5 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. జిల్లా మొత్తం మీద 4.3 మి.మీ వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ వర్షపాతం కాగా... మూడు రోజుల్లో 17.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌లో అధిక వర్షాల వల్ల 15,143 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మూడు, నాలుగు రోజుల్లో కూడా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సెబ్, ఎక్సైజ్ అధికారులు

కర్నూలు:స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బనగానపల్లె స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ కానిస్టేబుల్ ఎస్.రాఘవేంద్ర మృతిచెందడంతో ఆయన కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలిచారు. ఉమ్మడి కర్నూలు జిల్లా కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.74 వేలు వసూలు చేసి ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఏఈఎస్ వినోద్‌కుమార్, కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ సమక్షంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో మృతుని భార్య సంధ్యకు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఓబులేసు, జగన్నాథం, విరుపాక్షి రెడ్డి, అయ్యన్న, వెంకటరాముడు పాల్గొన్నారు.

2,324 మంది పింఛనుకు దూరం

కర్నూలు(అగ్రికల్చర్): సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 2,324 మంది పింఛను పొందలేకపోయారు. దూరప్రాంతాల్లో ఉండటం, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండటం, కేవలం రెండు రోజులు మాత్రమే పంపిణీ చేయడం వల్ల వీరంతా పింఛనుకు దూరమయ్యారు.

- కర్నూలు జిల్లాలో 2,42583 పింఛన్లకు నిధులు విడుదల కాగా 2,41,969 పింఛన్లు పంపిణీ చేశారు. పంపిణీలో కర్నూలు జిల్లాలో 99.53 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.
- నంద్యాల జిల్లాలో 2,19,046 పింఛన్లకు నిధులు విడుదలయ్యాయి. అయితే 2,17,856 పింఛన్లు పంపిణీ చేశారు. 99.46 శాతం పింఛన్ల పంపిణీతో నంద్యాల జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోండి



మాట్లాడుతున్న డీఐజీ ప్రవీణ్

ఆదోని అర్బన్: ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఐజీ కోయ ప్రవీణ్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి డీఐజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జనోత్సవంలో ఎలాంటి అపశ్రుతులు దొర్లకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని, రోడ్లపై గుంతలకు ప్యాచ్‌వర్క్ త్వరగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎస్పీ సోమన్న, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు శ్రీరామ్, సూర్యమోహన్‌రావు, రామలింగప్ప, నల్లన్న, ఎస్‌ఐలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెనూ రూపకల్పనకు సలహాలివ్వండి

- మధ్యాహ్న భోజనం సమీక్షలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత, రుచి స్థానిక అలవాట్లు, సంప్రదాయాలకు అనుగుణంగా ఉండేలా సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పాఠశాలల్లో అమల్లో ఉండే మధ్యాహ్న భోజనం పథకం పేరును డొక్కా సీతమ్మ బడి భోజనంగా మార్చినట్లు చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో మెనూ రూపకల్పనపై విద్యాశాఖాధికారులు, హెడ్‌మాస్టర్లు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యత, పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందివ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగా స్థానిక అలవాట్లు, సంప్రదాయాలు, పద్ధతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అందరి సలహాల మేరకు మెనూ రూపకల్పన చేస్తున్నామన్నారు. వారంలో వరుసగా ఐదు రోజులు గుడ్లు కాకుండా ప్రత్యామ్నాయంగా రెండు రోజులు పాలు, మూడు రోజులు పండ్లు ఇస్తే బాగుంటందని, జిల్లాలో దొండకాయ లభించకపోవడంతో దాని స్థానంలో వంకాయ, రాగిజావా స్థానంలో రాగి బిస్కట్లు, సాంబర్ బాత్ బదులుగా రైస్, సాంబారు, నాణ్యతతో కూడిన చిక్కీలు ఇవ్వడం, ఒకరోజు నాన్‌వెజ్ స్నాక్స్, శనివారం స్వీట్ పొంగల్‌కు బదులుగా సేమియా లేదా శనగపప్పు పాయసం ఇవ్వాలని పలువురు అధికారులు సూచనలు ఇచ్చారని, నివేదికను ప్రభుత్వానికి పంపి ఆమోదం లభించగానే అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేసీ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఈఓ శామ్యూల్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 32 మంది తహసీల్దార్లకు హడ్ హక్ పద్ధతిలో పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం విధి విధానాలను రూపొందించింది. అందులో భాగంగా జిల్లాలో పనిచేస్తున్న జేపీ శివశంకర్‌నాయక్, పి.రామంజనమ్మలకు పదోన్నతి లభించనుంది. కాగా, వీరిద్దరూ భార్యాభర్తలు.

వరద సహాయక చర్యలకు 12 బృందాలు

కర్నూలు(సెంట్రల్): విజయవాడ పరిసర ప్రాంతాల్లో వరద ప్రభావంతో నెలకొన్న పరిస్థితుల రీత్యా సహాయక చర్యల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి 12 బృందాలను పంపినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో బృందంలో ఎలక్ట్రీషియన్, ప్లంబర్, పారిశుద్ధ్య కార్మికులతో కలిపి 8 మంది సభ్యులుంటారన్నారు. కోడుమూరు నుంచి రెండు, గొందిపర్ల నుంచి ఒక్కటి, ఆలూరు, మద్దికెరల నుంచి ఒక్కొక్కటి, పత్తికొండ నుంచి రెండు, ఆదోని, కోసిగి, గోనెగండ్ల, మంత్రాలయం, హొళగుంద నుంచి ఒక్కో బృందం వెళ్లినట్లు చెప్పారు.

విద్యార్థులు తరగతులకు హాజరు కావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలోని పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు తరగతులకు హాజరు కావాలని వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ సూచించారు. మంగళవారం ఆయన ఆర్‌యూలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లతో పాటు ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ హాస్టళ్లలో క్రమశిక్షణకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. తరగతులు జరిగే సమయంలో విద్యార్థులు హాస్టళ్లలో ఉండకుండా చూడాల్సిన బాధ్యత హాస్టల్ సిబ్బందిపై ఉందన్నారు. తరగతులకు హాజరు కాని విద్యార్థుల సమాచారాన్ని వారి తల్లిదండ్రులకు ఇవ్వాలన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీ సమయానికి హాజరై తరగతులు తీసుకోవాలన్నారు. అకడమిక్ క్యాలండర్ ప్రకారం సిలబస్‌ను పూర్తి చేయాలన్నారు. వీసీ వెంట రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్‌యూసీఈ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

ఆరోగ్య ఆసరాకు ఎసరు!

- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 124 నెట్‌వర్క్ ఆసుపత్రులు
- 6,49,493 ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డులు
- 3,257 వ్యాధులకు చికిత్స
- 2,06,542 మందికి ఆసరా
- మార్చి వరకు లబ్ధిదారుల ఖాతాలో రూ.112.67 కోట్లు
- కొత్త ప్రభుత్వంలో అందని ఆసరా

అప్పటి దాకా పేదవాడు ప్రైవేట్ ఆసుపత్రి మెట్లెక్కలేదు. కార్పొరేట్ ఆసుపత్రి వైపు కన్నెత్తి కూడా చూసే సాహసం చేయలేదు. అలాంటి స్థితిలో నేనున్నానంటూ వచ్చారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి. పేదవాడి జేబులో ఆరోగ్యశ్రీకార్డు పెట్టి ఎంత పెద్ద ఆసుపత్రికైనా ధైర్యంగా వెళ్లు అని భుజం తట్టాడు. 18 ఏళ్ల క్రితం ఆయన తట్టిన భుజం ఇప్పటికీ ఎంతో భరోసాగా నిలుస్తోంది. అయితే ఆయనంటే గిట్టని ప్రభుత్వాలు వచ్చినప్పుడల్లా ఈ పథకానికి తూట్లు పొడుస్తూనే ఉన్నాయి. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీతో పాటు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలోనూ ఆసరాగా కొద్దిమొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించే ప్రయత్నం చేస్తోంది. – కర్నూలు(హాస్పిటల్)

- కర్నూలులోని బుధవారపేటకు చెందిన వినయ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నెలరోజుల క్రితం అతను ఆరోగ్యశ్రీ పథకం కింద అపరేషన్ చేయించుకున్నాడు. వాస్తవంగా అతను డిశ్చార్జ్ అయ్యే సమయంలోనే ఆరోగ్య ఆసరా మొత్తం బ్యాంకు ఖాతాలో జమ కావాలి. నెలరోజులు దాటినా రూపాయి కూడా రాలేదు. ఎప్పుడు వస్తాయో ఎవ్వరూ అతనికి సమాధానం చెప్పడం లేదు.

- కోడుమూరుకు చెందిన రాముడుకు నెలరోజుల క్రితం పక్షవాతం వచ్చింది. కోడుమూరు రోడ్డులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. డిశ్చార్జ్ అయ్యే సమయంలో అతనికి ఆరోగ్య ఆసరా మొత్తం రూ.30వేల దాకా అతని బ్యాంకు ఖాతాలో జమ కావాలి. కానీ నెలరోజులైనా ఆ మొత్తం అతనికి రాలేదు. ఎప్పుడు వస్తాయని సంబంధిత ఆసుపత్రిలో అడిగితే తమకు తెలియదన్న సమాధానం వస్తోంది.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ వివరాలు

సంవత్సరం	నిర్వహించిన చికిత్సలు	క్లెయిమ్ అయిన మొత్తం రూ.కోట్లలో	ఆసరా లబ్ధిదారులు	క్లెయిమ్ అయిన మొత్తంరూ.కోట్లలో
2019-20	35,819	78.21	8,527	4.59
2020-21	42,325	99.66	33,489	17.05
2021-22	53,459	106.05	45,705	25.1
2022-23	60,361	119.13	45,518	25.02
2023-24(మార్చి వరకు	97,161	183.45	73,303	40.91
మొత్తం	2,89,125	586.5	2,06,542	112.67

జిల్లాలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది పేద, మధ్యతరగతి వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఆయన తదనంతరం వచ్చిన ముఖ్యమంత్రులు పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. పథకం అమలులో పలు రకాల ఆంక్షలు పెడుతూ పేదలకు క్రమంగా దూరం చేసే ప్రయత్నం చేశారు. ఆయన తనయుడు, గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవం తీసుకురావడమే గాక మరింత గొప్పగా తీర్చిదిద్దారు. ఆయన రాక ముందు 1,800 లోపు ఉన్న చికిత్సలను 3,257కు పెంచారు. జిల్లాలో ప్రస్తుతం ఈ పథకం అమలు చేస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులు 124 ఉన్నాయి. ఇందులో 42 ప్రభుత్వ, 53 ప్రైవేటు, 29 డెంటల్ హాస్పిటల్స్ ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు గాను ఒక డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్, ఒక డిస్ట్రిక్ట్ మేనేజర్, ఏడుగురు నెట్‌వర్క్ టీమ్ లీడర్లు, ఇద్దరు ఆఫీస్ అసోసియేట్స్, 175 మంది ఆరోగ్యమిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో 2,89,125 మంది చికిత్స తీసుకోగా రూ.586.5 కోట్లను ఆసుపత్రులు క్లెయిమ్ చేసుకున్నాయి. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక విశ్రాంతి తీసుకునే సమయంలో ఆసరాగా ఉండేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య ఆసర పథకాన్ని అమలు చేశారు. గత మార్చి వరకు 2,06,542 మంది లబ్ధిపొందగా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.112.67 కోట్లు జమ అయ్యాయి.

ఆసరా వివరాలు మాకు తెలియవు



ఆరోగ్యశ్రీ పథకం కింద ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో రోగి బ్యాంకు ఖాతాలో ఆసరా మొత్తం జమ కావాల్సి ఉంటుంది. అది నేరుగా రోగి బ్యాంకు ఖాతాకే జమ అవుతాయి కాబట్టి ఆ విషయం మా దృష్టికి రాలేదు. ఎంత మందికి డబ్బు పడ్డాయి. ఎవరికి పడలేదన్న వివరాలు మా వద్ద ఉండవు. అర్హులైన రోగికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందా లేదా అన్న వివరాలు మాత్రమే మేం చెప్పగలం.

– డాక్టర్ భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

ఆగిన ఆరోగ్యశ్రీ ఆసరా

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేరును ఎన్‌టీఆర్ వైద్యసేవగా మార్చారు. పేరు మార్చడంతో పాటు పథకంలోనూ సమూల మార్పులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ(ఎన్‌టీఆర్ వైద్యసేవ) ద్వారా చికిత్స పొంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో రోగి బ్యాంక్ ఖాతాలో కొద్ది డబ్బు జమ అయ్యేది. అయితే నెలరోజులైనా డబ్బు జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు జమ చేస్తారో ఎవ్వరూ చెప్పడం లేదు. అసలు ఇస్తారో లేదో అన్న విషయంపైనా క్లారిటీ లేకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ దుర్మరణం

కర్నూలు: కల్లూరు సుద్దవాగు వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ దుర్మరణం పాలైంది. బెంగళూరు వైపు నుంచి హైదరాబాదు వైపు వెళ్లే మార్గంలో శ్రీచక్ర హాస్పిటల్‌కు ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహిళ శరీరం ఛిద్రమైంది. మంగళవారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించగా ప్రమాదంలో తెగిపడిన చెయ్యి, ఛిద్రమైన శరీరం, చీర కనిపించాయి. కల్లూరు వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఎవరైనా చూసి ఉంటే లేదా ఫొటోలు, వీడియోలు తీసి ఉంటే కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఫోన్ నంబర్ 72078 26287కు సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

బెల్లం ఊట ధ్వంసం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తాండ గ్రామంలో పాండు నాయక్ అనే వ్యక్తి నాటుసారా తయారు చేస్తున్నాడనే సమాచారంతో మంగళవారం దాడి చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ సజ్జద్ అలీ తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు పాండు నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్సార్‌బీసీ పైప్‌లైన్‌కు లీకేజ్



ఎస్సార్బీసీ బైపాస్ నుంచి లీకేజ్ అవుతున్న నీరు

పాణ్యం: గోరుకల్లు గ్రామంలో ఎస్సార్‌బీసీ పైపులైన్ నుంచి నీరు లీకేజ్ అవుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇన్‌ఫా రెగ్యులేటర్ వద్ద ఉన్న బైపాస్ పైపులైన్ నుంచి గోరుకల్లు వద్ద ఎస్సార్బీసీ కాల్వలో నీరు పంపిస్తున్నారు. కాగా గ్రామం వద్ద ఈ పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. లీకేజీ నీరంతా సమీపంలోని పంట పొలాల్లోకి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న లీకేజీ నీరు పొలాల్లోకి వెళ్లకుండా జేసీబీ సహాయంతో అధికారులు పైప్‌లైన్ కింద చిన్నపాటి కాల్వ తీసి పక్కకు మళ్లించారు.

జింకల బెడదతో పంటలకు నష్టం

- ఆందోళనలో రైతన్నలు




పంట పొలంలో జింకల మంద

పెద్దకడబూరు: మండలంలోని రైతులకు జింకలు బెడద ఎక్కువైంది. గంగులపాడు, కంబలదిన్నె గ్రామాల మధ్య జింకలు మందలు మందలుగా పొలాల్లో పడి పైర్లను నాశనం చేస్తున్నాయి. ఇప్పటికే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో సతమతమవుతున్న రైతులకు.. జింకల బెడద మరింత నష్టాన్ని చేకూరుస్తున్నాయి. వర్షాలకు బాగా తడిసిపోయిన పొలాల్లో జింకల మంద తొక్కిసలాటకు పంట భారీగా దెబ్బతింటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



శ్రీశైలం బ్యాక్‌వాటర్‌తో రాయి చెరువు నుంచి పరవళ్లు తొక్కుతున్న గాలేరునగరి సుజలస్రవంతి కాలువ



గాలేరు నగరి సుజలస్రవంతి కాలువ



నన్నూరు వద్ద రియల్ ఎస్టేట్ వెంచర్ ఏర్పాటుతో పొలంలోకి పారుతున్న వర్షం నీరు



మేఘాలలో తేలిపొమ్మన్నది: తుంపర్ల మధ్య దూసుకెళ్తున్న బైక్

జల్లంత.. తుళ్లింత!

గత మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై.. తుంపర్లు పడుతుండటంతో వాతావరణం ఒక్కసారిగా ఆహ్లాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో 'సాక్షి ఫొటోగ్రాఫర్' కర్నూలు–నంద్యాల రహదారిలో పాణ్యం వరకు 50 కిలోమీటర్లు ప్రయాణించగా ప్రకృతి పరశించిన దృశ్యాలు కంటపడ్డాయి. నల్లని రహదారుల పక్కన పచ్చని చెట్లు స్వాగతం పలుకుతుండగా.. చెరువుల్లోకి చేరిన నీటి మీదుగా చల్లని గాలులు మనసుకు సాంత్వననిస్తున్నాయి. ఇక వర్షంలోనూ పొట్టకూటికి పొలంబాట పట్టిన వ్యవసాయ కూలీలు.. రహదారుల మీదుగా వాహనాలను అనుసరించే వర్షం నీరు.. ఎన్నో అద్భుతాలకు ఈ ప్రయాణం వేదికగా నిలిచింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



తాండ్రపాడు వద్ద నల్లని మబ్బులను ముద్దాడుతున్న పచ్చని చెట్లు



ఓర్వకల్లు సమీపంలో పొలం పనులు ముగించుకొని గట్టుపై సామూహిక భోజనం



సుగాలిమిట్ట వద్ద వంపులు తిరిగిన రహదారిలో ప్రకృతి సోయగం



హుస్సేనాపురం సమీపంలో పొగాకు నారు తీస్తున్న కూలీలు



కనువిందు చేస్తున్న దిగువ తాండ్రపాడు చెరువు



జలకళ: సుగాలిమిట్ట తండా వద్ద నిండు కుండను తలపిస్తున్న కొచ్చెరువు

రంగాపురం గ్రామస్తుల వినూత్న నిరసన

బేతంచెర్ల: తాగునీటి సమస్యను పరిష్కరించాలని రంగాపురం గ్రామస్తులు ఎడ్ల బండ్లను రహదారిపై నిలిపి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎన్‌హెచ్ 340(బీ) జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామంలోని ఓ కాలనీకి సంబంధించి తాగునీరు సరఫరా అయ్యే పైపు లైను తొలగించారు. రెండు నెలలుగా తాగునీటి కోసం పక్క కాలనీలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులు ఎక్కువగా ఉన్నాయని, నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఎన్ హెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో కాలనీ వాసులు మురళీ, మద్దిలేటి, మహేశ్వరప్ప, నాగేశ్వరప్ప, మాసుంబాషాతో పాటు మరి కొంత మంది మంగళవారం ఎడ్ల బండ్లను రహదారిపై నిలిపి నిరసన వ్యక్తం చేశారు. దీంతో డోన్– బేతంచెర్ల వైపు వెళ్లే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, గ్రామ సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించేలా ఎన్‌హెచ్ అధికారులతో హామీ ఇప్పించడంతో గ్రామస్తులు నిరసన విరమించారు.



రహదారిపై ఎడ్ల బండ్లు నిలిపి నిరసన తెలుపుతున్న దృశ్యం



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు, గ్రామ సర్పంచ్

అనంతపురం వాసి కర్నూలులో ఆత్మహత్య

కర్నూలు: అనంతపురం జిల్లా యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన మేడసారి వెంకటేష్ (23) కర్నూలులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన ఏడాది క్రితం కర్నూలుకు వచ్చి దేవనగర్‌లోని ఎంఎస్9 లాడ్జి వెనుక గదిని అద్దెకు తీసుకుని ఆర్‌ఆర్‌బీ రిక్రూట్‌మెంట్ కోసం చదువుకుంటూ ఉండేవాడు. అలాగే వాహనాలకు జీపీఎస్ సిస్టమ్ బిగిస్తూ జీవనం సాగించేవాడు. ఈనెల 1న మధ్యాహ్నం 3 గంటల సమయంలో తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నాడు. 2వ తేదీ తల్లిదండ్రులు వెంకటేష్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో వారికి అనుమానం వచ్చి కర్నూలులో ఉన్న మృతుని చిన్నమ్మ కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు ఫోన్ చేసి గది వద్దకు వెళ్లి చూసి రమ్మని చెప్పారు. ప్రవీణ్, అతని స్నేహితుడు బాలరాజుతో కలసి గది వద్దకు వెళ్లి చూడగా తలుపులు మూసి ఉండటంతో బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి తిరుపాలు కర్నూలుకు చేరుకుని మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.



మృతిచెందిన వెంకటేష్

తీగ లాగారు.. దొంగలు దొరికారు!

- ఇద్దరు కాపర్ తీగల దొంగల అరెస్ట్
- ఉమ్మడి జిల్లాలో 45పైగా కేసులు
- రూ.4.48 లక్షలు, 150 కిలోల కాపర్ వైర్ స్వాధీనం

డోన్ టౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగలు, ఆయిల్‌ను అపహరించే ఇద్దరు అంతర్ జిల్లా దొంగలు పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి రూ.4,48,500 నగదు, 150 కిలోల కాపర్ వైర్, బైకుతో పాటు చోరీకి ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు మీడియాకు వివరించారు. కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ఉప్పరి శేఖర్ అలియాస్ సాంబరు, మేకల గిడ్డయ్య వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని వైర్లు, ఆయిల్‌ను చోరీ చేసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకున్నారు. కాగా రైతులను ఇబ్బందులకు గురి చేయడంతో పాటు పంటలు దెబ్బతినడానికి కారణమవుతుండటంతో దొంగలను పట్టుకోవడానికి ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ శరత్‌కుమార్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం రుద్రాక్ష గుట్ట సమీపంలో ఉన్న ఉప్పరి శేఖర్, మేకల గిడ్డయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఇద్దరు తీగల చోరీలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని బేతంచెర్ల, ప్యాపిలి, డోన్, ఎమ్మిగనూరు, కోడుమూరు, గోనెగండ్ల, కృష్ణగిరి, చిప్పగిరి, కోసిగి, ఆలూరుతో పాటు పలు మండలాల్లో దాదాపు 50 నేరాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే వీరిపై పలు పోలీసు స్టేషన్లలో దాదాపు 45 కేసులు నమోదు అయ్యినట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించారన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐలు భాస్కర్, శ్రీనివాసులు సిబ్బంది సుధాకర్ నాగరాజు, చాంద్‌బాషా, హరి, కార్తీక్, కోటీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దొంగల అరెస్టు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు సహకరించాలి

కర్నూలు కల్చరల్: వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయిరెడ్డి కోరారు. మంగళవారం వినాయక్ ఘాట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక లొసుగులతో ఉన్న వక్ఫ్ చట్టాన్ని సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందన్నారు. ప్రతిపక్షాలు ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం వ్యతిరేకిస్తున్నాయని ఆరోపించారు. 1917లో 7 లక్షల ఎకరాల వక్ఫ్ ఆస్తులున్నట్లు రికార్డులు ఉండగా ప్రస్తుతం అది 9 లక్షలు ఉన్నట్లు చెబుతున్నారన్నారు. 2 లక్షల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. గతంలో వక్ఫ్ బోర్డు చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. హిందూ మనోభావాలు దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లుకు అందరూ మద్దతు తెలపాలన్నారు. హిందువులు మేలుకొని చట్ట సరవణకు అనుకూలంగా తమ అభిప్రాయాలను చెప్పాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర సహ కార్యదర్శి ప్రాణేష్, కోశాధికారి సందడి మహేశ్వర్, జిల్లా అధ్యక్షులు టీసీ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, సహ కార్యదర్శి నాగరాజు, భజరంగ్ దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయిరెడ్డి

కుడా వైస్ చైర్మన్ బదిలీ

కర్నూలు (టౌన్): కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను మాతృసంస్థ సాంఘిక సంక్షేమ శాఖకు తిరిగి నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డుపైనే ఇసుక టిప్పర్లు!

సి.బెళగల్: మండల కేంద్రంలో రోడ్డుపై బారులు తీరిన ఇసుక టిప్పర్ల వల్ల స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న సచివాలయం – 2ను ఇసుక బుకింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు, గూడూరు ప్రధాన రోడ్డు సమీపంలో సచివాలయం ఉండటంతో ఇసుక బుకింగ్ కోసం వచ్చే భారీ వాహనాలను డ్రైవర్లు రోడ్డుపైనే నిలుపుతుండటంతో పాదచారులు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్, రెవెన్యూ అధికార యంత్రాంగం స్పందించి ఇసుక వాహనాలపై చర్యలు తీసుకుని, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



సి.బెళగల్‌లో ప్రధాన రోడ్డుపై నిలిపిన ఇసుక టిప్పర్లు

చీడపీడల నివారణకు 'ఇంప్లిసిట్'



పురుగు మందును విడుదల చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): పంటల్లో చీడపీడల నివారణకు భారతీయ బహుళ జాతి సంస్థ పారిజాత ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి చేసిన ఇంప్లిసిట్ అద్భుతంగా పనిచేస్తుందని సౌత్ జోన్ సేల్స్ మేనేజర్ యు.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం కర్నూలు జాతీయ రహదారిపై ఉన్న ఒక హోటల్ సమావేశ భవనంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఇంప్లిసిట్ పురుగు మందును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సాంకేతిక పరిశోధనలతో ఉత్పత్తి చేసిన కీటకనాశిని ఇంప్లిసిట్స్ పురుగు మందు మిరప పంటలో తామర, లద్దె పురుగు, నల్లి తదితర వాటి నివారణకు, పత్తి తదితర పంటల్లోని చీడపీడల నివారణకు బాగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సౌత్ డివిజినల్ మార్కెటింగ్ మేనేజర్ మధుసూదన్‌రావు, ప్రొడక్షన్ మేనేజర్ సాయిగౌతం, రీజినల్ మేనేజర్ బాలిరెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంజామల: రెడ్డిపల్లె రైల్వే బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. పేరుసోముల గ్రామానికి చెందిన గుల్లకుంట బాల ఓబన్న అలియాస్ నరేష్ (36) సోమవారం వ్యక్తిగత పని కోసం కర్నూలుకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నాడు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఏదో పని ఉందని భార్య కష్ణవేణికి చెప్పి ఇంటి నుంచి స్కూటీపై బయటకు వెళ్లాడు. కాగా తెల్లవారుజామున రెడ్డిపల్లె రైల్వే బ్రిడ్జి సమీపంలో వేగాన్ని అదుపు చేయలేక రాళ్లను ఢీకొని మృతి చెందాడు. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.



మృతి చెందిన నరేష్

నీటి కుంటలో పడి బాలుడి మృతి

సి.బెళగల్: మతిస్థిమితం లేని ఎనిమిదేళ్ల బాలుడు లింగన్న నీటి కుంటలో పడి మృతిచెందాడు. ఈ ఘటన సి.బెళగల్‌లో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో నివాసముంటున్న చాకలి రాముడు, రామలక్ష్మి దంపతుల కుమారుడు లింగన్న (8)కు మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవాడు. మంగళవారం లింగన్న తండ్రితో కలిసి తమ గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. గొర్రెల మంద నుంచి గొర్రె పిల్లలను వేరుచేసే పనిలో తండ్రి నిమగ్నమై ఉండగా కుమారుడు సమీపంలోని మోడల్ స్కూల్ రోడ్డు పక్కనున్న నీటి గుంతలో నీళ్లు తాగేందుకు వెళ్లి ప్రమాద శాత్తూ పడి మృతిచెందాడు. కాసేపటి తర్వాత తండ్రి గమనించి బోరున విలపించాడు.



లింగన్న (ఫైల్)